
సాక్షి
పల్నాడు
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



పులిచింతల సమాచారం
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.27 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 1,11,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



విశ్వకర్మకు నివాళులు
గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా నివాళులర్పించారు.



పశ్చిమ డెల్టాకు 6,034 క్యూసెక్కులు
దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 6,034 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సముద్రంలోకి 1,94,075 క్యూసెక్కులు వదులుతున్నారు.

ప్రజాస్వామ్యానికి పెను ముప్పు



కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై సాక్షి దిన పత్రికలో ప్రచురించారని పోలీసులు కేసులు నమోదు చేయడం తగదు. సాక్షి ఎడిటర్, విలేకరులను నిందితులుగా చూపడం హాస్యాస్పదం. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పత్రికలపై కేసులు పెట్టి వేధించడం దారుణం. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ హరించేలా కేసులు నమోదు చేయడం పెనుముప్పుకు సంకేతం. పాత్రికేయులకు తగిన స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే, పెదకూరపాడు



పాత్రికేయులకు రక్షణ కల్పించాలి



వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల హక్కు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత్రికేయులపై దాడులు చేయించడం దారుణం. జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయింది. సాక్షి ఎడిటర్, విలేకరులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం. సాక్షిని టార్గెట్ చేయడం అన్యాయం. ప్రతి జర్నలిస్టుకు కూటమి ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలి.

– వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త

రాష్ట్ర ప్రజల గొంతు నొక్కినట్లే..



సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలికి తీసి వాటిపై ప్రశ్నించే హక్కు మీడియాకు, పత్రికా ప్రతినిధులకు ఎల్లప్పుడూ ఉంటుంది. అటువంటి వారి హక్కులను అణగదొక్కేలా ప్రభుత్వాలు వ్యవహరించటం దుర్మార్గమైన చర్య. జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలపై మీడియాలో వార్తలు ఇస్తే వారిపై కక్షపూరితంగా మండల రిపోర్టర్ దగ్గర నుంచి చివరకు ఎడిటర్ వరకు కూడా అక్రమ కేసులు బనాయించటం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇప్పటికైనా మీడియా ప్రతినిధులపై, సంస్థలపై కక్షపూరితంగా వ్యవహరించడం మానుకోవాలి. వారు ఎత్తిచూపిన లోపాలను సరిచేసుకుని ముందుకు సాగాలి.

– డాక్టర్ ఈవూరి గణేష్, వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం



నరసరావుపేట: విద్యుత్ రంగంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామని రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు ఆర్.బంగారయ్య హెచ్చరించారు. యాజమాన్యం తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలని ఈ నెల 15వ తేదీ నుంచి దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న ధర్నా కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యుత్ ఉద్యోగులు ఎగ్జిక్యూటివ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వందల మంది విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్లు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారని బంగారయ్య పేర్కొన్నారు. మురళీ మోహనప్రసాదు, షేక్ నజియా, గోపాలరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాల కోసం ఈనెల 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డెప్యూటీ డైరెక్టర్ సాయి వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, సామాజిక వర్గ ధ్రువీకరణ, ఆధార్, మొబైల్ నంబరు వివరాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న సర్టిఫికెట్ల పరిశీలన, 29న విద్యార్థులకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. వివరాలకు 99516 77559, 97046 68909 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీచ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ



బాపట్ల టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు సూర్యలంక తీరంలో జరుగనున్న బీచ్ ఫెస్టివల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం అమరావతి సచివాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు కొండయ్య యాదవ్, నరేంద్ర వర్మ, ఏలూరి సాంబశివరావు, నక్క ఆనందబాబులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ సెలెక్టడ్ అభ్యర్థులకు ఐడీ కార్డులు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు ఈనెల 19న అమరావతిలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్న దృష్ట్యా సంబంధిత కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా గురువారం ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎంపికైన అభ్యర్థులు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్డులో ఉన్న ఆంధ్ర ముస్లిం కళాశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ ఫొటోతో పాటు వెంట వచ్చేవారికి సంబంధించిన పాస్‌పోర్ట్ ఫొటో, ఐడీ కార్డును తెచ్చుకోవాలని ఆమె సూచించారు.

ఆశ్రమ నిర్వాహకుడు చందుకు అవార్డు



మార్టూరు: మార్టూరులోని అమ్మ ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు తన సేవలకు గాను అరుదైన పురస్కారం అందుకున్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చెన్నైలోని చెన్నపురి తెలుగు విశ్వకర్మ సమాజం వారు తాడం కుప్పం బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. వృద్ధులకు చందు నిర్వహిస్తున్న సేవలకు గాను ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విశ్వకర్మ అవార్డు అందజేసి, ఘనంగా సత్కరించారు.

సైబర్ మోసం.. నమ్మితే నాశనం!

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు
- పోలీసు కేసుల వరకు వెళ్లని ఎక్కువ మోసాలు
- ఈ ఏడాది తొలి ఆర్నెల్లలో జిల్లాలో 967 ఫిర్యాదులు
- ఎఫ్ఐఆర్ నమోదు చేసినవి ఐదే
- అవగాహనాలోపంతో 'గోల్డెన్ అవర్' వినియోగించుకోని బాధితులు
- అత్యాశతో మోసపోతున్న వారే అధికం

సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్లకు వచ్చే సందేశాలకు కొందరు మోసపోతున్నారు. బ్యాంక్ అధికారులమంటూ వ్యక్తుల ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారు. ఉద్యోగాలు, కానుకల ఆశ చూపి వంచిస్తున్నారు. పరువుపోతుందని కొందరు, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇంకొందరు మిన్నకుండిపోతున్నారు.



సాక్షి, నరసరావుపేట: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. గ్రామాలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ ఏదో ఒక రకంగా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు యూపీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ ప్రాంతాలకు చెందినవారు కావడంతో కేసులు నమోదు చేసినప్పటికి వాటిని ఛేదించడం సవాల్‌గా మారుతోంది. దీంతో ప్రజల అప్రమత్తంగా ఉండటమే సైబర్ నేరాల నివారణకు మార్గమని అధికారులు చెబుతున్నారు.

ఉన్నత విద్యావంతులు సైతం...

సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలతో ప్రజలను బుట్టలో వేసుకొని డబ్బులు కొల్లగొడుతున్నారు. నిరక్షరాస్యులు మోసపోయే అస్కారం ఎక్కువగా ఉండగా... విచిత్రంగా విద్యావంతులై సాంకేతికత పరిజ్ఞానంపై అవగాహన ఉన్న వారు సైతం సైబర్ నేరగాళ్ల వలకు అడ్డంగా దొరికిపోతున్నారు. ప్రధానంగా కస్టమర్ కేర్, నకిలీ ప్రకటనలు, ఉద్యోగాలు, పెట్టుబడులు పేరుతో ఎక్కువగా ప్రైవేట్ ఉద్యోగులు, యువత మోసపోతున్నారు. పల్నాడులో ఓ వ్యాపారి ఇటీవల ఆన్‌లైన్ గేమ్ పేరిట ఏకంగా రూ.9 లక్షలకుపైగా మోసపోయి పోలీసులను ఆశ్రయించారు.

వెంటనే ఫిర్యాదు చేస్తే ఫలితం

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు సకాలంలో ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీకి అవకాశం ఉంటుంది. సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సైబర్ సెల్ నుంచి అందుతుంది, విచారణ తర్వాత పోలీసులు కేసు నమోదు చేస్తారు. సైబర్ నేరగాడి బ్యాంక్ ఖాతాలు తెలుసుకున్న పోలీసులు ఆ ఖాతాలను ఫ్రీజ్ చేసి కోర్టు ద్వారా నగదు తిరిగి రప్పించేలా చర్యలు తీసుకుంటారు. కొంతమంది మోసపోయిన వెంటనే 1930కి కాల్ చేయాలని తెలియకపోవడం, పరువుపోతుందనో ఆలస్యంగా ఫిర్యాదుచేయడం వల్ల సైబర్ నేరగాడు తస్కరించిన నగదును ఉపసంహరిస్తే ఆ తర్వాత చేసేదేమీ ఉండదు. దీంతో ప్రాథమిక దశలోనే వందల కేసులు ఆగిపోయి, ఎఫ్ఐఆర్ దశ వరకు రావడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై చివరి వరకు జిల్లాలో ఏకంగా 967 సైబర్ అటాక్‌లు జరగగా... ఎఫ్ఐఆర్ అయ్యింది 5 మాత్రమే అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొంత మంది చిన్న మొత్తమే అనో, బయటకు చెబితే పరువు పోతుందనో ఫిర్యాదుకు వెనుకాడుతున్నారు. కొందరైతే ఏకంగా అమ్మాయిల వలపు వలలో చిక్కి భారీగా నగదు మోసపోతున్నారు. అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాల నుంచి తప్పించుకొనే అవకాశముంటుంది.

జిల్లాలో నమోదైన సైబర్ కేసుల వివరాలు...

సంవత్సరం	కేసుల సంఖ్య
2020	59
2021	27
2022	27
2023	20
2024	60
2025 (తొలి ఆర్నెల్లు)	05

ఇవిగో నిదర్శనాలు...

- సత్తెనపల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అచ్చంపేట మండలంలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 10న వాట్సాప్‌లో ఓ గ్రూప్ ఇన్విటేషన్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయగా 'ఎఫ్ 979 2025 ఫార్చ్యూన్ గ్రూప్' ప్రత్యక్షమైంది. సభ్యుడిగా చేరిపోయారు. ఆ గ్రూప్‌లో స్టాక్‌మార్కెట్ పెట్టుబడుల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏంజల్ వన్ గార్డ్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని తెలిపారు. ఆ యాప్ ద్వారా రూ.లక్షలు సంపాదిస్తున్న వారి స్క్రీన్‌షాట్లను సైతం షేర్ చేస్తున్నారు. వాటిని నమ్మిన సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈ ఏడాది జూలై 25వ తేదీ నుంచి తాను, ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన భార్య, స్నేహితుల ఖాతాల నుంచి విడతలవారీగా రూ.64,50,199 బదిలీ చేశారు. లాభాలు వస్తున్నాయని గ్రూప్‌లో మెసేజ్‌లు వస్తున్నాయేగానీ, ఆ నగదు డ్రా చేయడానికి కుదరడం లేదు. ఏంటని గ్రూప్‌లో మెసేజ్ చేయగా... లాభాలు తీసుకోవాలంటే ట్యాక్స్ కట్టాలంటూ రిప్లై ఇచ్చారు. దీంతో అనుమానం వచ్చి దాని గురించి ఆరా తీయగా సైబర్ నేరగాళ్లు నడుపుతున్న ఫేక్‌గ్రూప్‌గా తేలింది. బాగా చదువుకున్న ఉపాధ్యాయ కుటుంబం ఇలా అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల బారినపడటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఈ నెల 5వ తేదీన కేసు నమోదు చేశారు.
- నరసరావుపేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సెల్‌ఫోన్‌కు పదిహేను రోజుల క్రితం ఓ కాల్ వచ్చింది. అందులో మీ ఆదాయ పన్ను చెల్లింపుల్లో లోపాలు ఉన్నాయని, రేపు ఉదయానికల్లా విజయవాడ కార్యాలయానికి వచ్చి సంబంధిత పత్రాలు సమర్పించాలని తెలిపారు. తాను బెంగళూరు కార్యాలయంలో ఉన్నానని, రేపటికల్లా విజయవాడ రాలేనని తెలిపారు. కాల్ చేసిన వ్యక్తి ఓ సలహా ఇచ్చాడు. మీ మొబైల్‌కు ఓ లింక్ పంపుతామని, కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే ఆన్‌లైన్‌లో సరిచేసుకోవచ్చని తెలిపి, వెంటనే లింక్ పంపాడు. దీంతో ఆ ఇంజినీర్ లింక్ ఓపెన్ చేసి, ఓటీపీ ఎంటర్ చేసి చూడగా వెంటనే తన ఖాతాలో ఉన్న రూ.3.74 లక్షలు మాయమయ్యాయి. దీంతో షాక్ తిన్న బాధితుడు బాధపడి మిన్నుకుండిపోయారు. స్నేహితుల సలహాతో వారం తర్వాత ఫిర్యాదు ఇవ్వడంతో ఆ సైబర్ నేరగాడి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడానికి చూస్తే అప్పటికే అకౌంట్ ఖాళీ అయ్యింది. మోసపోయామని తెలిసిన వెంటనే సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేసి ఉంటే నగదు వెనక్కి వచ్చే అవకాశం ఉండేది. ఇలా చాలమంది సైబర్ నేరగాళ్ల బారిన పడిన తర్వత ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు.



వైద్య కళాశాలల ప్రైవేటీకరణను
వ్యతిరేకించాలి

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగ నాయకులు
- 19న పిడుగురాళ్లలో 'చలో మెడికల్ కళాశాల'కు పిలుపు



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు రాకూడదనే ఉద్దేశంతోనే ఆయన ప్రారంభించిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగ నాయకులు ఆరోపించారు. బుధవారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అన్యాయం జరగనుందన్నారు. బినామీలు, వ్యాపారవేత్తలకు విద్య, వైద్యం అమ్ముకునే విధంగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. పార్టీ అధినేత పిలుపు మేరకు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చలో మెడికల్ కళాశాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. విద్యార్థి విభాగ అధ్యక్షులు పొనుగంటి చైతన్య పాల్గొంటారన్నారు. విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చిత్తశుద్ధితో కళాశాలలు పూర్తి
యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్ మాట్లాడుతూ పిడుగురాళ్లలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లాభక్షు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం కేంద్రంతో పోరాడి 17 కళాశాలలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తీసుకొచ్చారన్నారు. కరోనా కష్టకాలంలో వాటికి భూమి సేకరించి, ఐదు కళాశాలలను కూడా పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిడుగురాళ్లకు చెందిన నాయకుడు జలీల్ మాట్లాడుతూ.. నిరసనను అందరూ జయప్రదం చేయాలన్నారు.

రెండు ప్రాణాలు తీసిన అప్పు గొడవ

- రుణం విషయమై కౌలు రైతు బలవన్మరణయత్నం
- కేసుల భయంతో అప్పు ఇచ్చిన వ్యక్తి కుటుంబం ఆత్మహత్యాయత్నం
- బావిలో దూకిన తల్లి, కుమారుడు మృతి
- పురుగుమందు తాగి చికిత్స పొందుతున్న తండ్రి




పూర్ణకుమారి, వెంకటేష్ మృతదేహాలు




చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి: ఇద్దరు కౌలు రైతుల మధ్య చిన్న గొడవ కుటుంబాల వరకు చేరింది. ఈ క్రమంలో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటన సత్తెనపల్లి మండలం పణిదం గ్రామంలో బుధవారం వెలుగుచూసింది. వివరాలు... గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన దాసరి వెంకటేశ్వర్లు కౌలు రైతు. భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో కౌలు రైతు రామనాథం శ్రీనివాసరావుతో పరిచయం ఉంది. స్థానికుడైన కంచేటి జనార్దనరావు వద్ద ఎకరం పొలానికి రూ. 25 వేలు సాగుకు ముందే కౌలు చెల్లించేలా శ్రీనివాసరావు ఒప్పందం కుదిర్చాడు. శ్రీనివాసరావు వద్ద రూ. 50 వేల నగదు, ద్విచక్రవాహనం కుదవ పెట్టి రూ. 48 వేలను వెంకటేశ్వర్లు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకుండా దాటవేస్తుండటంతో బొడ్డు రమేష్ మధ్యవర్తిత్వం ద్వారా బైకు తాలూకు నగదు వడ్డీ సహా ఇచ్చాడు. మిగతా రూ. 50 వేలు అడగటంతో కాలయాపన చేస్తున్నాడు. ఈ నెల 15న శ్రీనివాసరావు, ఆయన కుమారుడు, మరో వ్యక్తి కలిసి వెళ్లి గట్టిగా ప్రశ్నించటంతో రూ. 25 వేలు ఇచ్చాడు. జనార్దనరావు వచ్చి కౌలు తాలూకు నగదు కూడా ఇప్పించాలని శ్రీనివాసరావును అడిగాడు. దీనికి సంబంధించి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు మధ్య వాదనలు జరిగాయి. అనంతరం వెంకటేశ్వర్లు, శ్రీలేఖ దంపతులు ఇంట్లో కూడా గొడవపడ్డారు. మనస్తాపం చెందిన వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి పురుగుమందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. సత్తెనపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించి, గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

నేలబావిలోకి దూకి...
ఈ క్రమంలో కేసులు అవుతాయనే భయంతోనే శ్రీనివాసరావు, ఆయన భార్య పూర్ణకుమారి (47), కుమారుడు వెంకటేష్ (23)లు బుధవారం పొలానికి వెళ్లారు. అక్కడే వారు చనిపోవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిసేపటికి తల్లి, కుమారుడు స్థానికంగా ఉన్న ఓ నేల బావిలోకి దూకి బలవన్మరణానికి యత్నించారు. పూర్ణకుమారికి గుండె సమస్యలు ఉండటంతో చనిపోయింది. కుమారుడు బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో గల్లంతయ్యాడు. సాయంత్రం 6 గంటల సమయంలో మృతదేహం బయటపడింది. శ్రీనివాసరావు కూడా అప్పటికే వివాహమై తాటికొండ మండలం పాములపాడులో ఉంటున్న కుమార్తె వెంకట జ్యోతికి ఫోన్ చేసి చనిపోవాలని ముగ్గురం నిర్ణయించుకున్నట్లు చెప్పి ఫోన్ ఆపేశాడు. తర్వాత గడ్డి మందు తాగి పొలం వద్దకు వెళ్లాడు. వెంకటజ్యోతి తన భర్తతో కలిసి వచ్చి తండ్రిని సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించింది. ప్రస్తుతం ఆయన వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఘటనా స్థలాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, పోలీసులు సందర్శించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. తల్లి, సోదరుడిని కోల్పోయిన వెంకట జ్యోతి విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

వరికపూడిసెలకు అనుమతులు తెచ్చిందే
వైఎస్సార్‌సీపీ

- బ్రహ్మారెడ్డి మేక తోలు కప్పుకున్న తోడేలు
- కూటమి ప్రభుత్వ వేధింపులతో 570కు పైగా కుటుంబాలు వలస
- 600 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు
- వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ప్రతిపక్షంపై అక్రమ కేసులు పెట్టడం, భూదందాలు, రేషన్ మాఫియా, సామాన్యులపై వేధింపులు తప్ప ప్రజా సంక్షేమం శూన్యమని పేర్కొన్నారు. అక్రమ కేసులతో అణగదొక్కే ధోరణికి తగిన సమయంలో పదింతలు సమాధానం చెప్పే రోజు వస్తుందని హెచ్చరించారు. కూటమి నాయకులు, అధికారులు ఈ విషయం గుర్తుంచుకోవాలన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మారెడ్డి మొదటి నుంచి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తి కావటం వలన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన రోజునే తనపై అక్రమ కేసులు మోపి జైలుకు పంపారన్నారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా తమ కుటుంబం ఉందని, నాలుగుసార్లు వరుసగా తనను ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారన్నారు. కష్టసుఖాలలో చేదోడుగా ఉండేందుకు ప్రజల వద్దకు వెళ్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. టీడీపీలో వర్గపోరు వలన గుండ్లపాడులో జంట హత్యలు జరిగితే అప్పటికప్పుడు స్క్రిప్ట్ తయారు చేసి పోలీసులపై ఒత్తిడి తెచ్చి తనపై అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. ఈ హత్యలో తనకు సంబంధం లేదని అందరికీ తెలుసన్నారు. ప్రత్యక్షంగా హత్యారాజకీయాలు చేసే బ్రహ్మారెడ్డి సుద్దపూస మాటలు, మహాత్మా గాంధీ ప్రసంగాలు ప్రజలు నమ్మరన్నారు. ఆయన గురించి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన హత్యాకాండకు సంబంధించి చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి అందరికీ తెలుసన్నారు. తనపై ఓడిపోయి 12 సంవత్సరాలు నియోజకవర్గ ప్రజలకు ముఖం చూపించే ధైర్యం లేని ఆయన ఇప్పుడు ధైర్యం, సవాలు అంటూ సుద్దపూసలు మాట్లాడే బ్రహ్మారెడ్డి మేకతోలు కప్పుకున్న తోడేలులాంటి వారని చెప్పారు. పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తూ చెక్‌పోస్టుల ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని పిన్నెల్లి ఆరోపించారు. మంచికల్లు, కంభంపాడు గ్రామాల మిల్లులలో ఎమ్మెల్యే చేసే రీసైక్లింగ్ వ్యాపారం గురించి ఇక్కడ ఎవరిని అడిగినా చెబుతారన్నారు.

అక్రమ కేసులతో వేధింపులు

నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచుతానని, అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలకు దూరంగా ఉంటానని పైకి శాంతి కాముకుడిలా ప్రవచనాలు వల్లించే బ్రహ్మారెడ్డి అసలు స్వరూపం వేరని పిన్నెల్లి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 600 మందికిపైగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈ పరిణామాలతో సుమారు 570కిపైగా కుటుంబాలు వలస వెళ్లినట్లు పేర్కొన్నారు. వీరందరూ దూర ప్రాంతాలలో కూలీలుగా, వాచ్‌మెన్‌లుగా పనులు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యక్తులపై ఈ కేసులు నమోదు చేయటంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. వీటిలో పాత్ర ఉన్న కలెక్టర్, ఎస్పీలపై కూడా భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైఎస్ జగన్‌తోనే ప్రాజెక్టు సాధ్యం
పల్నాటి ప్రజల చిరకాల వాంఛ వరికపూడిసెల ప్రాజెక్టు కోసం కృషి చేసిన పార్టీ తమదేనన్నారు. 1996లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రాజెక్టుకు శంకుస్థాపన శిలాఫలకం వేసి మరిచిపోగా, తనయుడు లోకేష్ మళ్లీ ఆవిష్కరించారని మండిపడ్డారు. తొలుత వైఎస్సార్, అనంతరం వైఎస్ జగన్‌ల చొరవతో కదలిక వచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టుకు పూర్తి అనుమతులు తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించి బ్రహ్మారెడ్డి మాట్లాడాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి మొత్తం రూ.1,115.66 కోట్లు నిధులను నియోజకవర్గానికి తెచ్చామని వివరించారు. ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డి ఎన్నికై కొన్ని నెలలే పూర్తయిందని, ఇంకా చాలా సమయం ఉందన్నారు. కచ్చితంగా అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధపడదామన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 135

కొమ్ములు : 68 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,950	8,950	8,950

కాయలు : 67 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,950	8,950	8,950

మొత్తం అమ్మకాలు : 101.25 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	42,909
అమ్మకాలు	41,629
నిల్వ	10,081

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,500
నంబరు-5	10,000-13,800
273	10,500-13,300
341	10,000-15,300
సూపర్ -10	11,500-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,600
341	10,000-16,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,800
బాడిగ-355	10,000 - 15,600
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,300
తాలుకాయలు	6,200 - 7,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,600
దేవనూరు డీలక్స్	10,000-14,000
తాలు	5,200 - 7,200

-కొరిటిపాడు (గుంటూరు)

సహకార సంఘాల బలోపేతంతో ఆర్థిక సమానత్వం

- జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు
- జిల్లాలోని సహకార సంఘాల చైర్‌పర్సన్లకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న అధికారులు, చైర్‌పర్సన్లు

నరసరావుపేట: దేశం మొత్తం ఒకే విధమైన సహకార విధానంతో బలమైన ఆర్థిక వ్యవస్థను తయారుచేసి సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వాన్ని రైతులు, పేదలకు అందించే ఉద్దేశంతో జాతీయ సహకార విధానం పాలసీని తీసుకొచ్చారని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. బుధవారం జీడీసీసీ బ్యాంకు మీటింగ్ హాలులో జాతీయ సహకార విధానంపై జిల్లా సహకార సంఘాల చైర్‌పర్సన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీలు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించడానికి అనుకూలమైన వ్యాపార విషయాలపై అధ్యయనంచేసి, తద్వారా ఆర్థిక స్వావలంబన పెంపొందించేందుకు వ్యాపారానికి అనువైన విధానాలను రూపొందించాలని డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ కె.తిరుపతయ్య సూచించారు. సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల నేషనల్ డ్రాఫ్టింగ్ కమిటీని మాజీ కేంద్ర మంత్రి సురేష్ ప్రభాకర్ ప్రభు అధ్యక్షతన ఏర్పాటు చేసిందన్నారు. రైతులు, సహకార వాదులు, సొసైటీ అధ్యక్షులు చేసే సూచనలను ఆ కమిటీకి అందించనున్నామన్నారు. క్రోసూరు సొసైటీ అధ్యక్షుడు కడియం శివనాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు ఎరువులు ఇబ్బంది లేకుండా ఉండటానికి ప్రభుత్వం సహకార సంఘాల ద్వారానే పంపిణీ చేయాలని, ఎరువులు మంజూరు ఆలస్యం అవుతున్నందున రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

- గుడిపాడు, గార్లపాడు, ముప్పాళ్ల, అనుపాలెం, మాదల తదితర సొసైటీ అధ్యక్షులు మాట్లాడారు. రైతులు, సహకార సంఘాల సభ్యులు, త్రిసభ్య కమిటీలోని సభ్యులు అందరూ ఇచ్చే సలహాలు, సూచనలను తప్పనిసరిగా ప్రభుత్వానికి అందజేస్తామని జిల్లా సహకార అధికారి నాగరాజు పేర్కొన్నారు. గురజాల, సత్తెనపల్లి సబ్ డివిజనల్ అధికారులు షేక్ రహంతుల్లా, కె.అంజమ్మ, జూనియర్, సీనియర్ ఇనస్పెక్టర్లు రమేష్, స్వరూప, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రా గాంధీ వావిలాల ఆదర్శప్రాయుడు

మాజీ మంత్రి అంబటి రాంబాబు


వావిలాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఆంధ్రా గాంధీగా పేరు తెచ్చుకున్న స్వాతంత్ర్య సమరయోధులు, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యులు వావిలాల గోపాలకృష్ణయ్య ఆదర్శప్రాయుడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వావిలాల స్మృతివనంలో బుధవారం నిర్వహించిన వావిలాల గోపాలకృష్ణయ్య 119వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మద్యపాన నిషేధం కోసం వావిలాల ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సత్తెనపల్లి శాసనసభ్యుడిగా వరుసగా 1952 నుంచి 1967 వరకు నాలుగు ఎన్నికల్లో గెలుపొంది 20 ఏళ్ల పాటు పని చేశారన్నారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్య జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. ముందుగా వావిలాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వావిలాల గోపాల కృష్ణయ్య మనవడు మన్నవ సోడేకర్, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, షేక్ నాగుల్‌మీరా, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, పంచుమర్తి అప్పారావు, కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, అచ్యుత శివ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ టీచర్లను తొలగిస్తే అసెంబ్లీ ముట్టడి

ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్


శ్రీనునాయక్‌తో కలసి నినాదాలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను తొలగించమని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ విమర్శించారు. పట్టణంలోని పురుషోత్తమపట్నంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను బుధవారం ఆయన కలిసి సమస్యలు చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం డీఎస్సీ నియామకాలు చేసే పనిలో ఉందన్నారు. తద్వారా ఇప్పటివరకు పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 191 గిరిజన గురుకుల పాఠశాలలు ఉండగా అందులో 1700 మంది అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీరంతా ఎన్నో ఏళ్లుగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్నప్పటికీ వీరిని తొలగించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత ఏడాది నవంబర్‌లో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమాలు చేపడితే చర్చల ద్వారా సమస్య పరిష్కరిస్తామని ఆనాడు గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే కొంతమంది ఉపాధ్యాయులు హైకోర్టును, జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. వారి ఆదేశాలను సైతం తుంగలో తొక్కివేస్తున్నారని, జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించకపోతే సంబంధిత ఉపాధ్యాయులతో కలసి అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. పి.స్టాలిన్‌బాబు, జి.ఏసుదాసు, ఇ.నారాయణబాబు, ఎ.అంజన కుమారి, యు.ఊర్మిళ, జి.పవన్‌సుధా పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'తో ఆరోగ్యకర దేశ నిర్మాణం

డీఆర్‌ఎం సుథేష్ణ సేన్


ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌ఎం సుథేష్ణ సేన్, ఏడీఆర్‌ఎం రమేష్, అధికారులు

లక్ష్మీపురం: గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని డీఆర్‌ఎం ప్రారంభించారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశభక్తి, పౌర బాధ్యతను శుభ్రతతో అనుసంధానిస్తుందని తెలిపారు. ప్రజలను ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములుగా మారేందుకు ప్రేరేపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానంగా 15 రకాల పనులు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరాలు, మారథాన్, వాకథాన్, మొక్కలు నాటడం, రీ సైకిల్ చేసిన ఉత్పత్తుల విక్రయాలు, ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. రైలు స్టేషన్‌లో మరుగు దొడ్లు, క్యాటరింగ్ ప్రదేశాలలో శుభ్రత, రైల్వే ప్రాంగణంలోని చెరువులు, సరస్సులు వంటి నీటి వనరుల శుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రతి రైల్వే స్టేషన్,కార్యాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, ఆయా శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఆచార్య అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం

- ఉత్తమ ఆచార్యులుగా, పరిపాలకురాలిగా గుర్తింపు
- షేర్-ఈ- కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీలో ప్రదానం
- పుడమి- పంటల సంరక్షణపై జమ్మూ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు



పురస్కారం అందుకుంటున్న అమృతవల్లి

పెదకాకాని(ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్రం, సూక్ష్మజీవ శాస్త్ర విభాగంలో ఆచార్యులుగా సేవలు అందిస్తూ విస్తృత పరిశోధనలు చేస్తున్న ఆచార్య ఆడిపూడి అమృతవల్లికి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఉత్తమ ఆచార్యులుగా, పరిపాలకురాలిగా పురస్కారం ఆమెను వరించింది. ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ భారతీయ శాఖ ఆధ్వర్యంలో జమ్మూలో 14,15,16 తేదీల్లో జరిగిన జాతీయ సదస్సుకు అమృతవల్లి అధ్యక్షత వహించారు. దశాబ్దం పైగా పీజీపీఆర్ అధ్యక్షురాలిగా, మూడు దశాబ్దాలకు పైగా అధ్యాపకురాలిగా పరిశోధకురాలుగా ఆమె చేస్తున్న సేవలకు గానూ ఈ పురస్కారం లభించింది. షేర్-ఈ-కశ్మీర్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ ఆఫ్ జమ్మూ ఉపకులపతి బి.ఎస్. త్రిపాఠి, ఘజియాబాద్‌లోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్-ఇన్నోవేషన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ ధార్, అమెరికా ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ చైర్మన్ ఆచార్య ఎం.ఎస్. రెడ్డి, జమ్మూ సీఎస్ఐఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ జబీర్ అహ్మద్, ఎస్‌కేయూఏఎస్టీ పరిశోధక విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె. గుప్తా వంటి ప్రముఖుల చేతుల మీదుగా అమృతవల్లికి పురస్కారం అందించారు. పుడమి- పంటల సంరక్షణే ధ్యేయంగా భారత దేశ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు విజ్ఞాన వేత్తలతో ఈ సదస్సు జరిగింది. నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, పలువురు పరిశోధకులు అమృతవల్లికి అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థులకు ఆధునిక విద్యే లక్ష్యం

సినీ నటి, టీచ్ ఫర్ చేంజ్ సంస్థ వ్యవస్థాపకురాలు మంచు లక్ష్మి


అమరేశ్వరాలయంలో మంచు లక్ష్మి, తదితరులు

అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వినూత్నంగా ఆధునిక విద్యాబోధన అందించటం టీచ్ ఫర్ చేంజ్ సంస్థ లక్ష్యమని టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధరణికోట మండల పరిషత్ పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ, పెగాసెస్ సిస్టమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ 3,4,5 తరగతుల విద్యార్థులకు ఆధునికంగా వచ్చిన మార్పులతో కూడిన విద్యను బోధించాలన్నారు. అలాగే కార్పొరేట్ స్కూల్ విద్యార్థులకు దీటుగా విద్యాబోధన ఉండాలన్నారు.
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అవసరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని తీర్చటానికి టీచ్ ఫర్ చేంజ్ సంస్థ పనిచేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 1,70,000 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేశామని అందులో అమరావతి మండలంలో 10 గ్రామాలలోని పాఠశాలల్లో తమ సంస్థద్వారా స్మార్ట్ క్లాస్ గదులు ఏర్పాటు చేశామన్నారు.

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రముఖ సినీనటి మంచు లక్ష్మి ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పెగాసెస్ సిస్టమ్స్ అధినేత హెచ్. ధరణి తో పాటుగా ఎంపీడీఓ పార్వతి, ఎంఈఓలు శివబాబు, కంచర్లప్రసాద్లతో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. తొలుత మంచు లక్ష్మి అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరుని దర్శించుకుని స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

జిల్లాకు రెండో విడత ఎరువులు రాక



నాదెండ్ల: పల్నాడు జిల్లాకు రెండో విడతగా 1185 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం కేటాయించిందని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు చెప్పారు. సాతులూరులోని రైల్వే ర్యాక్ పాయింట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడత కేటాయించిన ఎరువులను రైతులకు పంపిణీ చేశామన్నారు. రెండో విడతలో స్పిక్ యూరియా 530 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 210 మెట్రిక్ టన్నులు, డీఏపీ 445 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. వీటిని సొసైటీలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎరువులు రైతులకు సక్రమంగా అందేలా స్థానిక వ్యవసాయాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయనవెంట జిల్లా ఏడీఏ కార్యాలయం సిబ్బంది హనుమంతరావు, శ్రీనివాసరావు, ఏఓ శ్రీలత పాల్గొన్నారు.

అండర్ -19 ఫుట్‌బాల్, సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక



సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్, సెపక్‌తక్రా బాల, బాలికల జట్ల ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఈ ఎంపికలను ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.నరసింహా రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అండర్-19 స్కూల్ గేమ్స్ జాయింట్ సెక్రటరీ కె.పద్మాకర్, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎ.సురేష్ కుమార్, విద్యా కేంద్రం డైరెక్టర్ నిమ్మగడ్డ చిట్టిబాబు, ప్రిన్సిపాల్ షేక్ మౌలాలి, ఫిజికల్ డైరెక్టర్ పి.శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు గుండు సాంబశివరావు, బి.అనిల్ దత్త నాయక్, కోనంకి కిరణ్ కుమార్ ఫుట్‌బాల్ కోచ్‌లు పి.సురేష్, పి.వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహా రావు తెలిపారు.

జాబ్ మేళా 27కు వాయిదా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మాచర్లలోని ఎస్.కె.బి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న జరగాల్సిన జాబ్ మేళా వాయిదా పడిందని అధికారులు బుధవారం తెలిపారు. తిరిగి ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని, అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

మహిళ అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

సత్తెనపల్లి: అనుమానాస్పదంగా మహిళ మృతి చెందడంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయస్వామి గుడి వెనుక ఏరియాలో నివశిస్తున్న పసుపులేటి రాధిక (27) ఈనెల 12వ తేదీన పిల్లలు ఆడుకుంటూ గ్లాసులో కూల్‌డ్రింక్ పోసి చేతికి దొరికిన ఎలుకల మందును దానిలో కలిపి వెళ్లారు. అది గ్రహించని రాధిక, పిల్లలు కూల్‌డ్రింక్ గ్లాస్‌లో పోశారనుకోని సేవించింది. కొద్దిసేపటికి నోటి వెంట నురగలు రావడంతో భర్త గోపికి ఫోన్ చేసి కూల్‌డ్రింక్ తాగితే నోటి వెంట నురగలు వస్తున్నాయని చెప్పింది. దీంతో భర్త గోపి హుటాహుటిన ఇంటికి చేరుకొని చూడగా సమీపంలో ఎలుకల మందు ఆనవాళ్లు కనిపించడంతో వెంటనే పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకు వెళ్ళమని సూచించారు. గుంటూరులోని కిమ్స్ వైద్యశాలలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో అనుమానాస్పద మృతిగా పట్టణ ఎస్ఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతికి కారకులైన ముగ్గురు అరెస్టు

యడ్లపాడు: మద్యం షాపు వద్ద జరిగిన దాడి కారణంగా మృతి చెందిన యువకుడి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సంగం గోపాలపురం గ్రామానికి చెందిన వెల్పూరి శ్రీనాథ్ ఈ నెల 14వ తేదీన బోయపాలెం గ్రామంలోని మద్యం దుకాణం వద్ద మద్యం సేవిస్తుండగా తన భార్య అక్క కొడుకు పోట్లూరి విష్ణుతో వాగ్వాదం జరిగింది. అక్కడే ఉన్న మల్లవరపు చందు మణికంఠ, రావూరి విజయ్ విష్ణుతో కలిసి ముగ్గురూ కలిసి శ్రీనాథ్‌ను తీవ్రంగా కొట్టారు. తీవ్రగాయాలతో ఇంటికెళ్లిన శ్రీనాథ్ ఛాతీ నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో మృతుని అన్న సాంబయ్య ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు కారణమైన మల్లవరపు చందు మణికంఠ, పోట్లూరి విష్ణు, రావూరి విజయ్‌లను మంగళవారం బోయపాలెంలో అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: గూడవల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. శ్యాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మూడు దఫాలు దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఇంకా సీట్లు మిగిలిపోవడంతో నాలుగో సారి కూడా ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల కోర్సులు ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ సివిల్‌తో పాటు ఒక సంవత్సరం కోర్సు మెకానిక్ డీజిల్ సీట్లకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పాస్ మార్కుల ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పదవ తరగతి పాస్‌మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ కార్డు, ఫొటో, మెయిల్ ఐడీ, పర్మినెంట్ సెల్ నంబర్‌తో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 7702400570, 9398650408, 9491185900 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కళాశాలలో 29న 10 గంటలకు అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలపై హోం శాఖ మంత్రి అనిత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దుర్గాఘాట్ సమీపంలోని మోడల్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, దుర్గగుడి ఈఓ శీనానాయక్ హాజరయ్యారు. తొలుత ఇంద్రకీలాద్రికి చేరుకున్న హోం మంత్రి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ట్రాఫిక్‌కు సంబంధించి పలు అంశాలు, వీఐపీ పాస్‌లు, సీసీ కెమెరాలపై కీలకగా చర్చసాగింది. ఉత్సవాలకు 4,500 మంది పోలీసుల సేవలను వినియోగించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన బైక్

ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు

వేటపాలెం: వేగంగా బైక్ నడుపుతూ అదుపుతప్పి రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. బైపాస్ నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డులో ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జబ్బార్ కాలనీకి చెందిన కొమ్ము జగదీష్, గొల్ల మోజెస్ స్నేహితులు. వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగే స్కూల్ గేమ్స్‌కు వెళ్లారు. కాగా కొత్తపాలెం గ్రామానికి చెందిన స్నేహితుడిని వదిలి రావడానికి ముగ్గురు బైక్‌పై వెళ్లారు. స్నేహితుని అక్కడ వదిలారు. తిరిగి వచ్చే సమయంలో బైక్ వేగంగా నడపడంతో మలుపులో అదుపు తప్పి రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టారు. బైక్ నడుపుతున్న కొమ్ము జగదీష్‌కి ముఖంపై తీవ్ర గాయాలవ్వగా, వెనుక కూర్చున్న మోజెస్‌కి స్వల్ప గాయాలయ్యాయి. 108లో ఇద్దరినీ తొలుత చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి జగదీష్‌ని మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలలో చేర్చారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది మండలాల్లో మోస్తరు వర్షం

గుంటూరు పశ్చిమలో 53.2 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలోని తొమ్మిది మండలాల్లో వర్షం పడింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 53.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 2 మి.మీ. పడింది. సగటున 6.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి.. చేబ్రోలు మండలంలో 17 మి.మీ., పెదనందిపాడు 16.8, కొల్లిపర 13.4, తాడికొండ 8, గుంటూరు తూర్పు 6.6, దుగ్గిరాల 2.6, తుళ్లూరు మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 17 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 90.3 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 144.1 నమోదైంది.